25 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

బాలానగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈ నెల 25 నుంచి ప్రారంభమవుతాయని, మే 2 వరకు జరుగుతాయని ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ శ్రీహరి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మరో సెషన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టాస్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం


సీఎంని కలిసిన ఆది శ్రీనివాస్, దశరథ

దుండిగల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్నూరు కాపు యువ జన సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆరే దశరథ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.మహేందర్ పటేల్ ఉన్నారు.

సీఎంను కలిసిన టీఎన్‌జీవో కాలనీవాసులు

రాయదుర్గం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని టీఎన్‌జీవో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గండం జంగయ్య ఆధ్వర్యంలో కాలనీవాసులు సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవో కాలనీ సమస్యల గురించి సీఎంకు వినతిపత్రం అందజేశారు. తమ కాలనీ సొసైటీ ఎన్నికలు, రిజిస్ట్రేషన్ల సమస్యలు కాలనీ అభివృద్ధికి ఆటంకంగా మారాయని తెలిపారు. కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జోసఫ్, తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ఆదరించండి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుభాష్‌రెడ్డి కోరారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపారని, బీఆర్ఎస్‌తోనే మరింత అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ శిరీష, సతీష్ అరోరా, ప్రభాకర్‌గౌడ్, గోపి, పవన్, వెంకటేష్ పాల్గొన్నారు.

అమ్మవారి పూజలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


హోమం వద్ద కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ జయరామ్‌నగర్‌లోని మైసమ్మ పోచమ్మ ఆలయ శంకుస్థాపనకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి తనవంతు సాయం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జయరామ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మల్లేష్, ప్రధాన కార్యదర్శి మన్యహరి, దేవాలయం కమిటీ చైర్మన్ నర్సింహులు, భిక్షపతి, నరేష్, ఉపేందర్, బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌గౌడ్, సుధాకర్, కృష్ణగౌడ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తా: కార్పొరేటర్

గాజులరామారం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. సుభాష్‌చంద్రబోస్‌నగర్ పెంటయ్య బస్తీలో స్థానిక నాయకులతో కలిసి శనివారం పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పెంటయ్య బస్తీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. అధికారులతో మాట్లాడిన ఆయన డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని అధికారులను కోరారు. డివిజన్ జనరల్ సెక్రటరీ నవాబ్, నగేష్, రెహ్మాన్ పాల్గొన్నారు.


హుడాకాలనీ వాసులతో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

హుడాకాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

గచ్చిబౌలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి నల్లగండ్ల హుడాకాలనీలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్లు, మంచినీళ్లు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్థానికులు కోరారు. దీనికి స్పందించిన ఆయన అన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీలో ఉన్న పార్కు స్థలంలో ఓపెన్‌జిమ్, చిల్డ్రన్స్‌పార్కు, క్రీడాప్రాంగణం, మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను పరిశీలించారు. నల్లగండ్ల హుడాకాలనీ ఉపాధ్యక్షుడు రంజిత్, ప్రధాన సలహాదారు భారత్, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి దొరబాబు, నాయకులు కాశీనాథ్, విశ్వనాథం, అకాశ్, హర్ష పాల్గొన్నారు.

మోకాలి శస్త్రచికిత్సలో అధునాతన పద్ధతులు

● డాక్టర్ కే రఘువీర్


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రఘువీర్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మోకాలి శస్త్రచికిత్సలో అధునాతన పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయని డా.కె.రఘువీర్‌రెడ్డి అన్నారు. సాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ఇంజురీ ఆర్థ్రోస్కోపీ 25 ఏళ్ల సేవలు పూర్తి చేసిన సందర్భంగా హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం లైవ్ సర్జరీ కాన్ఫరెన్స్-2024ను నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహిస్తున్న సదస్సులో ఆర్థోపెడిక్ సర్జన్లు ఈ రంగంలో మెళకువలు తెలుసుకునేందుకు, తమ అనుభవాలు పరస్పరం పంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 400 మంది సర్జన్లు సదస్సులో పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.కె.రఘువీర్‌రెడ్డి, డా.అడ్రియన్ విల్సన్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ మోకాలి కీళ్ల సంరక్షణలో నాన్ సర్జికల్, సర్జికల్ చికిత్సలు రెండూ ఉన్నాయని, దీనికి విరుద్ధంగా మోకాలి మార్పిడి అనే పద్ధతిలో మోకాలికీలులో దెబ్బతిన్న భాగాలు తొలగించి, వాటి స్థానంలో కృతిమ భాగాలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. రీఅలైన్‌మెంట్ ఆస్టియోటమి, మెనిస్కస్(జాయింట్ స్పాంజ్), లిగమెంట్, కార్టిలేజ్ శస్త్రచికిత్సల వంటి అధునాతన పద్ధతులున్నాయని తెలిపారు. హై టిబియల్ ఆస్టియోటమీ(హెచ్‌టీఓ) అనేది ఒక శస్త్ర చికిత్స ప్రక్రియని, దీనిలో మోకాలి కీలు కింద ఉన్న షిన్ ఎముకను కత్తిరించడం ద్వారా వంకర కాలును నిటారుగా చేయవచ్చన్నారు. ఆస్టియోటమీతో దెబ్బతిన్న మోకాలి కీలు మార్పిడి అవసరం లేకుండానే మోకాళ్ల నొప్పులు తగ్గించవచ్చన్నారు. కాలు ముడుచుకుని కూర్చునే రోజువారీ కార్యకలాపాలపై ఎటువంటి పరిమితులుండవని, కృత్రిమ మోకాలి కీలుతో పోలిస్తే సహజ మోకాలి స్థిరత్వం ఎక్కువగా ఉంటుందన్నారు. మోకాలి ఆస్టియోటమీ తర్వాత కోలుకునేందుకు సాధారణంగా 6 నుంచి 12 వారాల సమయం పడుతుందన్నారు. సదస్సులో డా.క్రిస్టియన్ క్లే, దేశంలోని 20 మంది ప్రముఖ సర్జన్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరికలు

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీలోకి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తల వలసలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లోని పలు పార్టీల నుంచి వందల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు శనివారం కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.



నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ వడ్ల నగేష్‌చారి, స్థానిక యువకులు నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో శనివారం చేరారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

● ప్రగతినగర్‌లో..



ప్రగతినగర్‌లోని కేజీఆర్ గార్డెన్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు, మేయర్ కొలన్ నీలారెడ్డి ఆధ్వర్యంలో వంద మంది మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



హైదర్‌నగర్: ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో విష్ణు, వంశీగౌడ్‌తో పాటు పలువురు నాయకులు రామకృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

జీడిమెట్ల: సీఎం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి జగద్గిరిగుట్ట డివిజన్‌కు చెందిన కావలి చెన్నయ్య, సురేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో దాదాపు 500 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హన్మంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మహేందర్‌రెడ్డి, కేఎం.ప్రతాప్, భూపతిరెడ్డి పాల్గొన్నారు.





బాలానగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని సీనియర్ నాయకుడు దండుగుల యాదగిరి, డివిజన్ అధ్యక్షుడు కే.మల్లికార్జున్‌యాదవ్ అన్నారు. శనివారం ఓల్డుబోయిన్‌పల్లిలోని యాగదరి నివాసంలో విలేకరు సమావేశంలో అశోక్, జహంగీర్, షహెన్‌షా, శ్రీరాములు, మోహన్‌బాబు, శ్రీను, అస్లాం, గౌస్‌పాషా, వసీం, నర్సింహ్మ, బీరప్ప, షాయద్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నరేశ్వరరావు

శేరిలింగంపల్లిలో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం

మియాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం అందరూ కృషి చేయాలని, ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా నగరంలో స్థిరపడిన వారు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ అభ్యర్థి కాకర్ల సురేష్, కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి ఇంటూరి నరేశ్వరరావు కోరారు. శనివారం మియాపూర్ నరేన్‌గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా పార్లమెంట్ నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధిలో అట్టడుగు స్థాయికి చేరిందన్నారు. ఏపీ అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి టీడీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నెల్లూరు పార్లమెంట్ నియోకవర్గం కార్యకర్తలు పాల్గొన్నారు.


పాల్గొన్న నెల్లూరు పార్లమెంట్‌వాసులు

కార్పొరేట్ దిగ్గజాల కోసమే కమలం పార్టీ


ప్రొఫెసర్ కంచె ఐలయ్య

రాంనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే కమలం పార్టీ పనిచేస్తుందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కంచె ఐలయ్య ఆరోపించారు. దేశాన్ని హిందుత్వ దేశంగా మార్చేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ధ్వజమెత్తారు. మెజారిటీ ప్రజల అభివృద్ధికి దోహదపడ్డ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సామాజిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన జ్యోతిరావు పూలే-అంబేద్కర్‌ల జనజాతర రాష్ట్ర సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ, ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఉడత రవీందర్, ఆవాజ్ కార్యదర్శి ఎండి.అబ్బాస్, టీపీఎస్‌కే కన్వీనర్ జి.రాములు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరాంనాయక్, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ అన్నపూర్ణ, నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, గుమ్మడి గణేష్ పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ స్టేడియంలో జాతీయ చేనేత సిల్క్ ఎక్స్ పో

● ప్రారంభించిన కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి


జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న వేణుగోపాలచారి, పక్కన నిర్వాహకులు

కవాడిగూడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులు, చేతివృత్తుల వారు తయారు చేసిన చేనేత వస్త్రాలు, వస్తువులను కొనుగోలు చేసి వారిని ఆర్థికంగా ఆదుకుంటూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. శనివారం రాత్రి నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను ఆయన రిటైర్డ్ జడ్జి జస్టిస్ మధుసూదన్‌రావుతో కలిసి ప్రారంభించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన దాదాపు 300 స్టాళ్లను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నెల రోజులపాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర అధ్యక్షురాలు కోట దేవకిదేవి, నిర్వాహకులు సత్యనారాయణచౌదరి, మహేష్‌సాయిచౌదరి, నదీమ్ పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

రాయదుర్గం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ చౌరస్తాలోని పవర్‌మ్యాక్స్ ఫిట్‌నెస్ సెంటర్‌లో శనివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. జిమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు మాదాపూర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అగ్ని ప్రమాదం కారణంగా జిమ్‌లోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయని ఫైర్ ఆఫీసర్ ఫజర్ తెలిపారు. తమకు సమాచారం అందిన 8 నిమిషాల్లోసంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసినట్లు ఫజర్ తెలిపారు. కరెంటు మీటర్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలిపారు.


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ నరసింహారెడ్డి

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కేపీహెచ్‌బీకాలనీ: వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జేఎన్‌టీయూ వీసీ కట్టా నరసింహారెడ్డి సూచించారు. కూకట్‌పల్లి ఫైర్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్న ఫైర్ సర్వీస్ వీక్ వాల్‌పోస్టర్‌ను వీసీ తన చాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): యూ టర్న్ తీసుకుంటుండగా బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగతినగర్ ఎన్ఆర్‌ఐ కాలనీలో నివాసం ఉండే తలశిల బాబురావు(66) శనివారం ఉదయం కేపీహెచ్‌బీలో కూరగాయలు తీసుకొని ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రగతినగర్ వెళ్లే రోడ్డులో యూటర్న్ తీసుకుంటుండగా బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. గాయాలపాలైన అతడిని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. బాబురావుకు ఆయన కుమారుడు రమేష్ ఫోన్ చేయగా విషయం తెలిసింది. దీంతో వారు ఆసుపత్రికి చేరుకున్నాడు. అప్పటికే బాబురావుకు చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతిడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

రాయదుర్గం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి ప్రాంతంలో కొంత కాలంగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలి ఏపీహెచ్‌బీకాలనీలో గంజాయి విక్రయిస్తున్నట్లు మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సవదత్తి బసవరాజప్ప ప్రసాద్(38)ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 250 గ్రాముల గంజాయి ప్యాకెట్లు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొన్నారు. నిందితుడు దూల్‌పేట్ నుంచి గంజాయి కొనుగోలు చేసి చిన్నచిన్న ప్యాకెట్లుగా మార్చి కూలీలకు విక్రయిస్తానని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలు

జీడిమెట్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రొడామిస్త్రీనగర్‌కు చెందిన సయ్యద్ సలీమ్ కుమారుడు సయ్యద్ యాసిన్(18) ఇంటర్ వరకు చదువుకున్నాడు. తండ్రి నిర్వహిస్తున్న సౌండ్‌సిస్టమ్ వర్క్‌లో పని చేస్తున్నాడు. శ్రీరామనవమి సందర్భంగా మార్కండేయనగర్‌లోని హనుమాన్ ఆలయం వద్ద మైకులు ఏర్పాటు చేస్తుండగా శనివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగలడంతో యాసిన్ చేతులు, కాళ్లు కాలిపోయాయి. స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఉచితాలకు మోసపోకూడదు: ఈటల

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అమలుకు సాధ్యం కాని హామీలు, ఉచితాలకు ప్రజలు మోసపోకూడదని మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈటల రాజేందర్ కొంపల్లి మున్సిపల్‌లోని గంగస్థాన్, జయదర్శిని, శ్రీసాయికృప అపార్టుమెంట్, కొంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను ఓడించాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ఎలాంటి లాభం ఉండదన్నారు. ఈ ప్రాంత సమస్యలను మోదీని కలిసి తీర్చుతానని ఆయన హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో ఒక్క ఓటు వృథా కాకుండా బీజేపీకి వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రూరల్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, అర్బన్ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి సతీష్‌సాగర్, గిరివర్ధన్‌రెడ్డి, రాజిరెడ్డి, శివాజీరాజు, సరితారావు, జనార్ధన్‌రెడ్డి సంధ్య, మాధవి, నాయకులు, పలు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన పలువురు నాయకులు

జీడిమెట్ల: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో జగద్గిరిగుట్ట, జయరాంనగర్, శ్రీరామ్‌నగర్‌కు చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, గిరివర్ధన్‌రెడ్డి, జేకే శేఖర్‌యాదవ్, అరుణారెడ్డి, పరశురాం పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ క్రీడాకారిణికి హోప్ ఫౌండేషన్ చేయూత


శ్రీవల్లికి చెక్కును అందిస్తున్న రాగం నాగేందర్‌యాదవ్, విజయ్‌కుమార్

చందానగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కిక్ బాక్సింగ్‌లో రాణిస్తున్న క్రీడాకారిణి కీర్న శ్రీవల్లికి హోప్ ఫౌండేన్ చేయూతనందించింది. శనివారం చందానగర్‌లోని ఫౌండేషన్ కార్యాలయంలో కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్, ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ రూ.30 వేల చెక్కును శ్రీవల్లికి అందజేశారు.

ఎన్నికల్లో విజయం కోసం ప్రత్యేక సమావేశం

జీడిమెట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం షాపూర్‌నగర్‌లోని శుభం హోటల్‌లో శనివారం నిర్వహించారు. నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, ఎమ్మెల్యే మహేందర్‌రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం.ప్రతాప్, ఎన్నికల పరిశీలకులు శోభారాణి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, నాయకులు పాల్గొని పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.


చేవెళ్ల సభకు తరలిన నాయకులు, కార్యకర్తలు

కాసానిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాం

రాయదుర్గం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించుకుంటామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శనివారం కేసీఆర్ నేతృత్వంలో చేవెళ్ల సభకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కార్పొరేటర్లు రాగం నగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్, నార్నె శ్రీనివాస్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, సిందూరెడ్డి, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్త కృషి చేయాలన్నారు.



ఏపీ ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గం కుంచేపల్లి గ్రామంలో శనివారం తెదేపా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డి తరఫున వారి కుటుంబ సభ్యులతో కలిసి ఎన్నికల ప్రచారంలో కేపీహెచ్‌బీ డివిజన్ తెదేపా అధ్యక్షులు ఎస్కే సత్తార్ పాల్గొన్నారు. ఏపీలో ఎన్డీఏ కూటమి విజయ దుందుభి మోగిస్తుందని, సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. - కేపీహెచ్‌బీకాలనీ, ఆంధ్రజ్యోతి

పేకాట ఆడుతున్న ముగ్గురి అరెస్టు

రూ.1.52 లక్షల నగదు స్వాధీనం

రాయదుర్గం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని కీ ఓయో లాడ్జిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలోని కీ ఓయో లాడ్జిలో గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నట్లు మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందడంతో శనివారం ఉదయం గచ్చిబౌలి పోలీసులతో కలిసి లాడ్జిపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న మసీదుబండ కొండాపూర్‌కు చెందిన ఎం.శ్రీకాంత్(27), ప్రశాంత్‌నగర్‌కాలనీ కొండాపూర్‌కు చెందిన ఎన్.కిరణ్(30), ఇందిరానగర్‌కాలనీ గచ్చిబౌలికి చెందిన ఎన్.ప్రశాంత్‌రెడ్డి(28)లను పోలీసులు పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు, పేకాట నిర్వాహకుడు హఫీజ్‌పేట్, ప్రేమ్‌నగర్‌కు చెందిన ఎం.బస్వరాజ్(26) పరారయ్యాడు. ముగ్గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1.52 లక్షల నగదు, 7 సెట్ల ప్లే కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తప్పిపోయిన బాలుడు

గంటల వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద ఆడుకుంటూ తప్పిపోయిన బాలుడిని పోలీసులు గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇంటికి సమీపంలో ఆడుకుంటున్న జె.హరీశ్వ(3) తప్పిపోయాడు. కొండాపూర్‌లోని వైట్‌ఫీల్డ్ రోడ్డులో అటు ఇటూ తిరుగుతుండగా రాజశేఖర్ అనే వ్యక్తి గమనించాడు. బాలుడి వివరాలు అడగగా చెప్పలేకపోవడంతో బాలుడిని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో అప్పగించాడు. మాదాపూర్ డీసీపీ వినీత్ ఆదేశాల మేరకు మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ బృందం బాలుడి వివరాలు సేకరించి, గంటలోపే కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా బాలుడిని పోలీసులకు అప్పగించిన రాజశేఖర్‌ను డీసీపీ అభినందించారు.


రాజశేఖర్‌ను అభినందిస్తున్న డీసీపీ వినీత్, తండ్రితో బాలుడు

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

రూ.1.85 లక్షలు స్వాధీనం

రాయదుర్గం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.85 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. గచ్చిబౌలిలోని ఓ లాడ్జ్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. హఫీజ్‌పేట్‌కు చెందిన ఇద్దరు ప్రధాన బుకీలు జీతు శర్మ, మాడిశెట్టి ఆజయ్‌లు పరారు కాగా.. హఫీజ్‌పేట్ ప్రేమ్‌నగర్‌కు చెందిన సబ్ బుకీ మాడపాటి బస్వరాజ్(26)ను అదుపులోకి తీసుకున్నారు. ఇతనితో పాటు గచ్చిబౌలి కొండాపూర్‌కు చెందిన పంటర్లు అమన్ చౌదరి(23), నేలం రవి(31), కొల్లూరుకు చెందిన కె.మణికాంతరెడ్డి(20)ని అదుపులోకి తీసుకున్నారు. బ్యాంకుల ఖాతాలలో ఉన్న మొత్తం రూ.1.85 లక్షల నగదు నిల్వలను జప్తుచేసి, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తూ పట్టుబడిన నిందితులు